
# సినీ బేతాళ కథలు

– డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 12 -

### *గరమ్‌నాభి*

విక్రమార్కుడు విసుగుచెందకుండా బేతాళుడి శవాన్ని మళ్ళీ తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు. ‘ఓ విక్రమార్కా! నీకు శ్రమకలగకుండా ఉండేందుకు ఇంకో కథ చెబుతాను విను.‘ అని బేతాళుడు కథ ప్రారంభించాడు –

‘భాగ్యనగరంలో భారీ చిత్రాల దర్శకుడు ఔరంగజేబు అని ఉన్నాడు. ఔరంగజేబు ఎంతోమంది సీనియర్ దర్శకుల దగ్గర ఎన్నో ఏళ్ళు అసిస్టెంట్‌గా పనిచేసి ఎంతో అనుభవం సంపాదించి దర్శకుడై వారి అడుగుజాడల్లో నడుస్తూ అప్పుడప్పుడు పరిగెడుతూ, పడిపోతూ, లేస్తూ ఎన్నో సాంఘిక చిత్రాలు, పౌరాణిక చిత్రాలు, కళాత్మక చిత్రాలు, బూతు చిత్రాలు, నీతి చిత్రాలు అన్నిరకాల మసాలాలు వాడి దర్శకత్వం చేసి గొప్ప బాక్సాఫీసు దర్శకుడైపోయాడు

ఒకరోజు ఔరంగజేబు తన తదుపరి చిత్రనిర్మాణ ప్రయత్నంలో ఉండగా, అతడిని చూడ్డానికి యిరగారం యిందురేఖ అనే ఔత్సాహిక నటి వచ్చింది.

ఔరంగజేబు అసిస్టెంట్ – ‘సార్! ఎవరో యిందురేకట – సూడ్డానికొచ్చింది. లోపలికి తోలమంటారా?‘ అనడిగాడు.

‘తోలడం ఏట్రా నీ మొకం? అదేవన్నా గాడిదా, గుర్రమా? ఇన్నాళ్ళు నా దగ్గర పనిచేస్తున్నా నీ జట్కా బుద్ధులు పోలేదు. రమ్మను లోపలికి–‘ అన్నాడు ఔరంగజేబు.

లోపలికొచ్చిన యిందురేఖను చూడగానే ఔరంగజేబు కళ్ళార్పకుండా స్టిల్ ఫోటోలా అయిపోయాడు. వెండితెరను వెలిగించే కళ్ళతో, ప్రేక్షకుల్ని సమ్మోహనం చేసే ఒళ్ళుతో అప్సరసలా ఉంది.

‘ఏటలా సూత్తన్నారు?‘ అనడిగింది యిందురేఖ.

‘ఏ ఊరమ్మా మీది?‘ అని తేరుకుని అడిగాడు ఔరంగజేబు.

‘యిరగారవండి. తవరిదీవూరేనాండీ?‘

'కాదు. మాదీ యిరగారంలాగే - యిరాకావరం'

'అదే వరం వండే?'

'అదేనమ్మా యిరాకు. సరేగానీ నీ పేరేవిటన్నావ్?'

'యిందురేకండి. సినసిన్న సినేమాలు కాసిని సేసానండి. తవరు బిజీకదా - సూసుండరు.'

'ఏం చదువుకున్నావ్?'

'సిన్నప్పట్నించీ యాకిటింగే విష్టవండి. సదూకునే టైవెక్కడండి?'

'మరి నీ డైలాగులు నువ్వే చెబుతావా? లేక డబ్బింగా?'

'బలేటోరే! నాకు డబ్బింగెందుకండి. నాది పయ్యుత్రవైన సినేమా డైలాగు తెలుగండి.'

'కరెక్టుగా చెప్పావు. సరేగానీ, నీకు ముందూ, వెనకా ఎవరన్నా ఉన్నారా?'

'మీరు బలే పరాసికాలాడతారు ఔరంగజేబుగారు. వీరోయిన్ యేసాలు ముందు యెనకా సూసేగదండి యిత్తారు. నిజం సెప్పాలంటే నా యాకిటింగ్‌కి నా కయ్యే ఎగ్రస్టాలండి.'

'అందులో డౌట్లేదు. అయితే నీకెలాంటి వేషాలిష్టం?'

'నేనలాంటిలాంటి యేసాలు సైలేనండి. ఈరోయినే సేత్తానండి. మీరా గొప్ప డవిరిక్టర్లు. మీ సేతిలో పడితే అసలు సిసలు హీరోయినయిపోతానండి.'

'సరే చూస్తాను.'

'సూడ్డం కాదండి. అంతా యిప్పుడే ఫిక్సయిపోవాలండి. నాను పగలూ రాత్రీ సెమించి సేత్తానండి - వొల్లు దాసుకోనండి.'

'సరే.'

'థాంకులండి. మీది యిరాక్ అయినా, మీ పేరు ఔరంగజేబే అయినా అందర్నీ వొకటిగా సూత్తారండి.'

'చూడమ్మా - నేను తెలుగువాణ్నే. ఉద్యోగరీత్యా మా తల్లితండ్రులు అక్కడికి వలస వెళ్ళినప్పుడు - అక్కడ పుట్టాను. అక్కడి పరిస్థితులకనుగుణంగా నాకలా పేరెట్టారు.'

'అదాండి సంగతి. అందుకే తెలుగలా దంచేత్తున్నారు. నానూ అంతేనండి. పరిసిత్తుతులే పెదానం అండి. యిరాకైనా సిరాకైనా కట్టానికి ఎరవనండి. ఏవైనా సరే మీ డవిరెక్సన్‌లో వీరోయిన్ వేసాలు ముమ్మరంగా సైయ్యాలని డిసైడైపోయానండి.'

'సరే. యిందురేఖా! నీఅందం , నీ ముక్కుసూటితనం నాకు బాగా నచ్చాయి. మన నెక్స్ట్ పిక్చర్‌కి నువ్వే హీరోయిన్‌వి.'

'అయ్‌బాబో అవురంగు జేబీగారూ - నా నోట్లో పందార పానకం దారాపాతంగా కుమ్మరింసేసారు. సరేగానండీ - మరి నా బొడ్డు మీద ఏం పండేత్తారు?'

'బొడ్డుమీద పండేవిటి రేఖా?'

'మరదేనండి. బొడ్డుమీద పండేయించుకుంటేనే కారకటరు పండుద్ది.'

'ఉన్న పళ్ళన్నీ ఉత్తమ దర్శకులు వాడేశారు. నేను మళ్ళీ బొడ్డు మీద పళ్ళు రాలిస్తే, కాపీ కొట్టానని ప్రేక్షకులు నా పళ్ళు రాలుస్తారు.'

'అదేం మాట జేబీగారు - ఆరి అడుగుజాడలే కదా మీరు ఫాలోయింగులు. ఆరు ఎయ్యని కొత్తపండేదన్నా ఎయ్యండి.'

యిరగారం యిందురేఖని చూసిన క్షణం నుంచీ యిరాక్ ఔరంగజేబుకి మనసు వశం తప్పిపోయింది. ఆమె ఏం చెప్పినా నో అనాలనిపించడంలేదు.

'సరే రేఖా! మన షూటింగ్ టైముకి సీజన్ బట్టి యింతకు ముందు వాడిన పళ్ళు కాకుండా వేరే ఏదో ఒక పండు దొరక్కపోదు. ఏదో ఒక పండు వాడదాంలే' అని హామీ యిచ్చేశాడు.

'అవురంగజేబీగారూ! మీరు గొప్ప దర్శకనిర్మాతలు, కోటీస్వరులు. మీరు కో అంటే కొల్లలు కొల్లలుగా సెట్లన్నీ పళ్ళు కురుత్తాయి.' అని ఔరంగజేబుని హఠాత్తుగా వాటేసుకుంది యిరగారం యిందురేఖ.

షూటింగ్ మొదలైంది.

హీరోయిన్ మీద పాట చిత్రీకరణ.

'పండు ముసిలిదైతే వనమంతా ఘుమఘుమ.. అది రాలి నన్ను తాకితే తనువంతా, టిఁవటిఁవ' అనే పాట.

పాట మధ్యలో దర్శకుడి సంకేతం మేరకు పండు రాలి, యిరగారం యిందురేఖ పొట్టమీద పడింది. అలాపడగానే యిందురేఖ 'సచ్చానో, నూకాలమ్మ తల్లీ!' అని ఆర్తనాదం చేసింది.

ఔరంగజేబు 'కట్' అన్నాడు. తర్వాత 'పేకప్' అన్నాడు. అవాళ షూటింగ్ అంతటితో ఆగిపోయింది. అర్జంటుగా యాంబులెన్స్‌ని పిలిచి, యిందురేఖని 'విరాలా' కార్పోరేషన్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు ఔరంగజేబు. ఆ హాస్పిటల్లో పేషెంట్ల కంటే ఎక్కువమంది డాక్టర్లు, నర్సులు హడావుడిగా రాత్రీ పగలూ పనిచేస్తున్నట్టుగా వుంటారు.

హాస్పిటల్‌కి చేరగానే హీరోయిన్ యిందురేఖ 'నాకడుపు, నాకడుపు' అని ఆర్తనాదాలు చేసింది. వెంటనే ఆమెను ప్రసూతి వార్డుకి ట్రాలీ మీదెక్కించి తీసుకుపోయారు.

లేడీ డాక్టర్లు 'మీ కడుపుకేం ఫర్వాలేదమ్మా!' అని హామీ యిచ్చారు.

మిడ్‌వైఫులు 'కొంచెం నొప్పికోర్చుకో అమ్మా! నీకు పండంటి హీరో పుడతాడు' అని ధైర్యం చెప్పారు.

'పండు కడుపులో లేదు. కడుపుమీద పడింది. షూటింగ్ యాక్సిడెంట్' అని ఔరంగజేబు విడమరిచి చెప్పాడు.

'అలాగా – అయితే సర్జికల్ థియేటర్‌కి తీసుకువెళ్తాం.' అన్నారు మెడికల్ స్టాఫ్.

'అవును. అర్జంటుగా బ్లడ్ టెస్ట్‌లు, స్కానింగ్‌లు అరేంజ్ చెయ్యండి. పొట్టకోసి అక్షరం ముక్కలు తీసిపారేసి, యింటెన్సివ్ కేర్‌కి తరలించాలి' అంటూ డాక్టర్లు, నర్సులు ఒకటే సందడి.

ఔరంగజేబుకి అయోమయంగా ఉంది.

యిరగారం హీరోయిన్ యిందురేఖ 'అమ్మా! నూకాలమ్మో!' అని శోకన్నాలు పెట్టేస్తోంది.

ఆపరేషన్ థియేటర్లో సర్జన్లు, దుర్జన్లు చిన్న చిన్న మెరిసే కత్తులు సానపెడుతున్నారు. హైహీల్స్ వేసుకుని చిన్న చిన్న గంతుల్తో గబగబా నడిచే నర్సులు వానర్స్‌లా అనిపిస్తున్నారు.

'కడుపు మీద బొడ్డు చుట్టూ చర్మం మీద పై పై దెబ్బలు తగిలాయంతే – యీ మాత్రానికి నా ప్యారీ హీరోయిన్ కడుపెందుకు కోస్తున్నారు? ఎందుకీ బ్లడ్ టెస్ట్‌లు? ఏవిటీ స్కానింగ్‌లు? వాటీజ్ దిస్ నాన్సెన్స్?' అని ఔరంగజేబు ఎంత ఆక్రోశించినా ఆ హాస్పిటల్లో ఎవరూ వినిపించుకోలేదు.

నాలుగురోజులు నరకయాతన తర్వాత యిరగారం హీరోయిన్ యిందురేఖ 'విరాలా' హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయింది.

'అంతా మీ అదృష్టం! వొకోసారి హాస్పిటల్‌కి వచ్చిన వారు పైకి వెళ్ళడమేగానీ, యింటికి వెళ్ళడం జరగదు.' అని హాస్పిటల్ గుమాస్తా పునర్జన్మను గుర్తుచేశాడు.

హాస్పిటల్ బిల్లు చెల్లించి హీరోయిన్‌తో బైటికి వచ్చిన ఔరంగ జేబుకి అర్జంటుగా రవీంద్రనాధ్ ఠాగూర్‌లా గడ్డం పెరిగిపోయింది. అంతకంటే విరివిగా గడ్డాలు పెంచుకుని, చేతిలో సినిమా లేని పెద్ద పెద్ద నిర్మాతలు, దర్శకులు మునిపుంగవుల్లా ఎదురొచ్చి - మేమూ ఒకప్పుడు ఈ కార్పొరేషన్ హాస్పిటల్ గడప తొక్కినవారమే- అని ఔరంగజేబుకి ధైర్య సానుభూతుల్ని కలిపి చెప్పారు.

'నాతో మా యిరగారం వచ్చెయ్ అవిరంగజేబీ..' అంది అమాయకంగా యిందురేఖ.

ఓటమి ఎరుగని ఔరంగజేబు కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

- అదీ విక్రమార్కా! ఇప్పుడు చెప్పు. ఇంత గందరగోళం తెచ్చిపెట్టిన, దర్శకుడు ఔరంగజేబు వాడిన ఆ పండు ఏవిటి, ఈ వైపరీత్యానికి కారణం ఆ పండా లేక ఆ కార్పొరేషన్ హాస్పిటల్ విధానమా? - ఈ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీకు వెయ్యిసార్లు తలనొప్పి వచ్చి డాక్టరు పాలవుతావ్" అని బేతాళుడు ముగించాడు.

వెంటనే విక్రమార్కుడు - "ఓ బేతాళా! షూటింగ్‌లో ఔరంగజేబు వాడిన పండు - పనసపండు. హీరోయిన్ పొట్టమీద గంట్లు పడటానికి కారణం - పండుకాదు. స్ఫూర్తి.

స్ఫూర్తి యెప్పుడూ సందర్భోచితంగా, సమయోచితంగా ఉండాలి. అంతేకాని కార్పొరేషన్ హాస్పిటల్ పనితీరు ప్రసక్తే లేదు. ఆ తీరు సూర్యుడు ఎండ విసురుట వంటిది. చంద్రుడు వెన్నెల కురియుట వంటిది. చెట్లు కాయలు కాచి పండ్లనిచ్చుట వంటిది. తెలుగు సినిమా స్థాయి వంటిది.

బాధ్యత భగవంతుడి సేవ అనుకుంటే ఫలప్రాప్తి తథ్యం "

"యతః ప్రవృత్తిర్భూతానం యేన సర్వమిదం తతమ్

స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః!!"

- అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీ కృష్ణభగవానుడు -" అని ముగించగానే బేతాళుడు తన బొడ్డు తడుముకుంటూ ఎగిరి మళ్ళీ చెట్టెక్కేసాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments